# మళ్ళీ ఆడపిల్లే!

ఇచ్ఛాపురపు రామచంద్రం

"శేషాద్రిగారూ!"

పిలుపు విని— ఆయన వరండాలోకి వచ్చారు. "నువ్వటోయ్ సుధాకరం! ...రా... కూర్చో... ఏమిటి విశేషాలు?" ఆప్యాయంగా పలకరించారాయన.

"రాత్రి— టెలిగ్రావ్ వొచ్చిందండీ..." సుధాకరం గొంతు దీనంగా ఉంది. "మళ్లీ ఆడపిల్లేనండీ." అన్నాడు భారంగా.

"ఇంత మంచి వార్త యిలా గటోయ్ చెప్పడం! ... ఉండు..." హడావిడిగా లోపలికి వెళ్ళివొచ్చి— "నోరు తెరువ్... చూడు... మధ్య తరగతి కుటుంబాల్లో ఎప్పుడుపడితే అప్పుడు స్వీట్లు సిద్ధంగా ఉండవు. పంచదార మాత్రం స్వీటు కాదూ?" అంటూ అతని నోట్లో గుప్పెడు పంచదార పోశారు.

సుధాకరం—ఎదురింట్లో ఉంటున్నాడద్దెకి. శేషాద్రిగారంటే గౌరవమూ, అభిమానమూ. ఆయనని పెద్ద దిక్కులా భావించుకుని కష్ట సుఖాలు చెప్పుకుని— సలహాలు తీసుకుంటాడు. శేషాద్రిగారు కూడా చిన్న వాళ్లలో చిన్నవాడిగా కలిసిపోగల సరసులు. మాటలో చతురతా, కొంచెం హాస్యమూ మిళితమై ఉండటంతో ఎవరినయినా యిట్టే ఆకట్టుకుంటారు.

"కంగ్రాచ్యులేషన్స్..." అన్నారాయన. చేతికి మిగిలిన కొంచెం పంచదారమూ తన నోట్లో దులుపుకుని. పంచదార తిన్నా — సుధాకరం ముఖం చేదు మింగినట్లే ఉంది. ఏడుపు ముఖం పెట్టేసి — "నాకు పుట్టింది— పున్నామ నరకంనుంచి తప్పించే పుత్రుడు కాడండీ. ఆడపిల్ల. రెండో ఆడపిల్ల..." అన్నాడు.

"ఈ రోజుల్లో యిటువంటి చాదస్తాలేమిటోయ్. నాలాటి ముసిలాళ్లే వొదిలేస్తూంటే నువ్వింకా వీటిని పట్టుకు వేలాడుతున్నావా!? ఊఁ. ఎప్పుడు బయలుదేరుతున్నావు మాతా శిశువులని చూడ్డానికి? అమ్మాయి క్షేమమేనా?"

"నేను వెళ్లడంలేదండీ. అబ్బాయియితే వెళ్దామని ఎంతో ఆత్రతపడ్డాను..." పెన్నిధి పోగొట్టుకున్నట్టే అతి విచారంగా ఉంది సుధాకరం కంఠం.

"ఏమిటయ్యా అలా దిగాలు పడిపోతావ్? ఆడపిల్లయితే ఏం?"

"బోలెడంత కట్నాలుపోసి అల్లుళ్లని వెదికి పెళ్లిళ్లుచేసి మనం ఆరిపోవాలి. నన్నడిగితే — ధనవంతులందరికీ ఆడపిల్లలూ, సామాన్యులందరికీ మొగ పిల్లలూ పుడుతూంటే సమసమాజం సులభంగా ఏర్పడుతుందేమో..."

"కాదేమో. విత్తమున్నవాడి చిత్తం కదా? అప్పుడు — రూలు మార్చేసి ఆడపిల్లలకి కట్నం వసూలు చేస్తారు మగ పిల్లలనుంచి. వరకట్నం— మళ్లీ కన్యాశుల్కమౌతుంది. మన మధ్యతరగతి జాతినెవరూ ఉద్ధరించలేరోయ్. వ్యవస్థ వెందే ఏ మార్పయినా మనకి ప్రాణసంకటంగానే పరిణమిస్తూ — మనం — ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్నట్లు మిగులుతాం ఏనాటికీ."

"మీకేం... ఎన్నయినా చెబుతారు... ఏమయినా చెబుతారు. అదృష్టవంతులు... ముగ్గురూ కొడుకులే!" సుధాకరం కంఠంలో కొంచెం అసూయకూడా ధ్వనించింది.

ఆదే క్షణంలో...

కాఫీలు పట్టుకుని వొచ్చింది అనసూయమ్మగారక్కడికి. "అమ్మాయి పుట్టిందటగా? మంగళవారం... మహాలక్ష్మి పుట్టిందన్నమాట... వెళ్లినప్పుడు — శ్యామలని నేనడిగేననికూడా చెప్పు..." అని — కాఫీ గ్లాసులు పట్టుకు వెళ్లిపోయారావిడ అక్కడినుంచి.

"ఐతే — నేను చాలా అదృష్టవంతుణ్నీ... నువ్వు చాలా దురదృష్టవంతుడివీ అంటావు. ఔనా?"

"కాదూ?... ఆడపిల్లకీ మగపిల్లడికీ — పోషణ, చదువు వగైరాలన్నిటికీ ఖర్చు సమానమే. పెళ్లికి — ఆడపిల్ల కట్నపు మూటలు తరలించుకుని పైకి పోతుంది. అబ్బాయియితే — మూటలూ తెస్తాడు. ఇంటికి కోడలినీ తెస్తాడు. వృద్ధాప్యంలో — అవసరానికి ఆదుకుంటాడు..."

అతని మాటలు వింటూనే పకపక నవ్వారు శేషాద్రి. "దూరపు కొండలు నునుపనేది నిజమే సుమీ!... చూడబోతే — నువ్వింకా... పితృదేవోభవ అనే సత్యకాలంలోనే ఉన్నట్లున్నావు. నీకో చిత్రమైన విషయం చెప్పేదా?"

"ఊఁ..."

"ఉండు..." లోపలికి వెళ్లి ఐదు నిముషాలకి వొచ్చి... "లాభంలేదోయ్. ప్రత్యక్షంగా చూపుదామనుకున్నాను. కాని... ఉత్తరం ఎక్కడో పారేశారు. మన యిళ్లల్లో ఏదిమాత్రం దొరుకుతుంది సమయానికి?"

"ఏం ఉత్తరం?"

"మా పెద్దబ్బాయి వ్రాశాడులే. పటం కట్టించుకు దాచుకోవలసిన ఉత్తరం - మళ్లీ జీవితంలో పొరపాటు చేయకుండా..."

"మీరేం చెబుతున్నారో నా కర్థంకావడం లేదు..." అయోమయంగా చూశాడు సుధాకరం — రంగులు మారిన శేషాద్రిగారి ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ.

"నాకు ముగ్గురు కొడుకులు కదా? నేను నా ముగ్గురి కొడుకుల ముచ్చటూ చెబుదామనుకుంటున్నాను — నీకు వినే ఓపికుంటే ..."

"చెప్పండి. నేనూ — నా బాధ మరిచిపోదామన్న ప్రయత్నంలోనే ఉన్నాను" అన్నాడు సుధాకరం ఆడపిల్ల బాధను తలుచుకుంటూ.

శేషాద్రిగారు వాలుకుర్చీలో వెనక్కి వాలి ఓ నిట్టూర్పు విడిచారు.

* * *

"మధూ! వొచ్చావా ... ఎలా రాశావు టెస్ట్?" ఆత్రంగా అడిగారు శేషాద్రి.

"ఏదో రాశానులే."

"అదేమిటలా నిర్లిప్తంగానూ బాధ్యతా రహితంగానూ జవాబు చెబుతావ్? వ్రాత పరీక్షలూ యింటర్వ్యూలూ బాగాచేసి త్వరగా ఉద్యోగం సంపాదించుకోవూ? చదువు పూర్తయి రెండేళ్లౌతూంది ..." మందలిస్తున్నట్లుగానే చూశారు.

"ఆ భారమూ బాధ్యతా హవికావు నాన్నా!"

"మరెవరివి?" ఆశ్చర్యంగా చూశారు.

"నీవి!" ఖచ్చితంగా చెప్పాడు మధు.

"నావా!?" తెల్లబోయారాయన.

"ఔనాన్నా...నీకు తెలియకపోతే తెలుసుకో. కుర్రాళ్ల రాసే పరీక్షలకీ, చేసే ఇంటర్వ్యూలకీ కాదు ఉద్యోగాలు వొచ్చేది. వాళ్ల నాన్నలివ్వగలిగే లంచాలకీ ... తేగలిగే సిఫార్సులకీను. దిసీజ్ ద రూలాఫ్ ద డే. కనుక — తండ్రీ... నాకుద్యోగం రాలేదంటే ఆ లోపం నాదికాదు, నీది" కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేసి వెళ్లిపోయాడు మధు.

* * *

అప్పుడు — హైదరాబాదులో పనిచేస్తున్న పెద్దబ్బాయికి ఉత్తరం రాశాను విషయం వివరిస్తూ — ఓ ఐదువేలు సర్దమని. దానికి తిరుగుటపాలో జవాబొచ్చిందోయ్. ఉత్తరం ఉంటే చూపేవాణ్ని. నువ్వూ చూసి తరించేవాడివి. నీకా అదృష్టం లేక నానోట వినాల్సి వొస్తూంది. అంతతోనేసంతృప్తిపడు సుధాకరం.

"నాన్నగారూ!

మీరు రాసిన ఉత్తరం అందింది. ఐదువేలు పంపమని అవలీలగా రాసేశారు! మీ అమాయకత్వానికేమనుకోవాలో తెలియలేదు.

'సిటీలో ఎనిమిది వందలతో బ్రతకడమంటే— అసిధారావ్రతమన్నమాటే. మీ కోడలు నన్ను రోజూ దెప్పుతూనే వుంటుంది. ఒక్క తులం బంగారం పెట్టి నెక్లెసయినా చేయించలేకపోయారు పెళ్లయి అయిదేళ్లయినా అంటూ. ఎంత సిగ్గుగా ఉందో! స్కూటరు కొనుక్కోవాలనే కోరికను— లూనాకి చంపుకుని— చివరకది

ACC NO.
CL. NO................
LANGU GE ...............
LATE.
వెటపాలెం.



కూడా అసాధ్యం యీ జన్మకి అని నిరాశచేసుకుని బ్రతుకుతున్నాను. పట్టుమని పది ఖరీదైన చీరలేనాలేవని మీకోడలికి నిత్యమూ అసంతృప్తే. ఇవీ మా జీవితాలు. మిమ్మల్ని డబ్బు పంపమని అడగనందుకు సంతోషించండి. నాకు ఎప్పుడు డబ్బుకోసం వ్రాసినా ప్రయోజన ముండదని తెలియజేయుటకు మిగుల చింతించుచున్నాను...''

''యోగక్షేమాలయినా లేకుండా—చురకలాటి ఉత్తరం. ఎంత అదృష్టవంతుల కందుతుం దిటువంటి ఉత్తరం ?''

భారంగా నవ్వి... ముచ్చటగా మూడో అధ్యాయం కూడా వినేశావో... నీకు పూర్తిగా అర్థమైపోతుందీ నా అదృష్టమేమిటో. మూడో వాడు మురహరి. ఆఖరివాడనీ... చురుగ్గా ఉంటాడనీ... వాణ్ని కాన్వెంట్‌లో చేర్పించాను. నా దగ్గర వాడికి చనువెక్కువ.

''డాడీ!''

''వాట్ సన్ ?''

''అర్జెంటుగా ఓ హండ్రెడివ్వు...''

''హండ్రెడా ! దేనికీ ?''

''చెప్పింది చెయ్యి. చరిత్ర దక్కు మరెప్పుడూ. ఈసారికి చెబుతున్నాను. ఫ్రండ్సమీ పిక్నిక్ వేస్తున్నాం ''

''హండ్రెడ్‌కాదు, పెన్నయినా యివ్వలేను. సారీ.'' అనేశాను. మరి నేను — మా రెండో వాడి ఉద్యోగానికి పెట్టుబడి సమకూర్చే యత్నంలో ఉన్నానుగా ? పదులూ యిరవైలూ కూడా పొదుపుచేస్తున్నాను.

''నువ్వెప్పుడూ యింతే నాన్నా. నీ కొడుకుని కావడం నేను పూర్వ జన్మలో చేసుకున్న పాపం. స్టూడెంటు నన్నమాటేకాని ఓ లైఫూ లేదు, ఫన్నూలేదు. మిగిలిన ఫాదర్స్‌ని చూసయినా నేర్చుకోరాదూ పిల్లల్నెలా పెంచాలో ? ఇలా గయితే నేను నలుగురిలోనూ తలెత్తుకుని చదువు కోలేను. తరువాత నీ యిష్టం...''అల్టిమేటమ్ యిచ్చేసి వెళ్లిపోయాడు.

చచ్చిపోయాక పున్నామ నరకమనేది నిజంగా ఉంటుందో ఉండదో ? ఉన్నా — దాని నుంచి కొడుకులు మనని రక్షిస్తారో రక్షించరో అసలు తెలీదు. కాని...నా అనుమానమే సుమా... పుత్రులు తల్లితండ్రులకి యీ రోజుల్లో — భూమ్మీదే పున్నామ నరకం సృష్టిస్తున్నారేమో అని. నీ అభిప్రాయమేమిటి ?'' అమాయకంగా చూస్తూ అడిగారు సుధాకరాన్ని.

''నేను — వెళ్తానండి.'' అతను లేచాడు, ఓ నిశ్చయానికి వచ్చినవాడిలా. శేషాద్రిగారి మాటను వినిపించుకోలేదతను.

''ఎక్కడికి ?''

''పాపని చూసేందుకు, ఓ గంటలో రైలుంది.'' అంటూ అతను కదులుతూంటే — ''నా ఆశీస్సులు కూడా అందజెయ్...'' అని కేక వేశారాయన; వాలుకుర్చీలోంచే.

సుధాకరం గేటు దాటేశాడు.

అప్పుడు అనసూయమ్మ వొచ్చింది— వొంటింట్లోంచి చేతులు తుడుచుకుంటూ. తనలో తనే చిరునవ్వులు చిందించుకుంటున్న భర్తని చూస్తూ — ''పాపం ... చిన్నవాణ్ని పట్టుకుని ఏమిటంతంత ఉపన్యాసాలిచ్చేస్తున్నా రింతసేపూ ?'' అడిగింది.

''ఉపన్యాసాలు కావే... కథలు.''

''కథలా !''

''ఔను. కథలే. అనసూయా ... చేదు మందు కంటె తియ్యటి కథలే బాగా పని చేస్తాయి సుమీ ఒక్కొక్కప్పుడు : సుధాకరం భార్యనీ, శిశువునీ చూసుకుందుకు వెళ్తున్నాడు.''

అనసూయమ్మకి — అర్థమంయీ అవనట్లున్నాయాయనమాటలు. ★